క్లుప్తంగా

విద్యాసాగర్‌కి డాక్టరేట్



వడమాలపేట: మండల పరిధిలోని ఎస్‌బీఆర్ గ్రామానికి చెందిన చెన్ను పాటి విద్యాసాగర్ ఎస్వీ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఆచార్య ఓబుల విజయ సారథిరెడ్డి పర్యవేక్షణలో బయోకెమిస్ట్రీలో పరిశోధనకు గాను డాక్టరేట్ లభించింది.

15న వారపు సంతకు వేలం

కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరంలోని వారపు సంత, కూరగాయల మార్కెట్, బస్టాండ్, జంతు వధశాలలకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ ఈఓ మణి తెలిపారు. ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు పంచాయతీ కార్యాలయం ఆవరణలో వేలం పాట జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు వారపు సంతకు రూ. 50 వేలు, దినసరి మార్కెట్‌కు రూ.10 వేలు, బస్టాండ్‌కు రూ.10 వేలు, జంతు వధశాలలకు రూ. 5వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని వివరించారు.

ప్రీ ఫైనల్ పరీక్షల పరిశీలన



పరీక్షను పరిశీలిస్తున్న ఎంఈఓ

పాలసముద్రం: మండలంలోని ఆముదాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న ప్రీఫైనల్ హిందీ పరీక్షను ఎంఈఓ రాజేంద్రప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. పబ్లిక్ పరీక్షలు విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆయన వెంట హెచ్‌ఎం గణపతి, హిందీ ఉపాధ్యాయుడు యువరాజ్ ఉన్నారు.

ద్రౌపదీ దేవికి ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారిని మేల్కొలిపి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. తదుపరి ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి భక్తి ప్రపత్తులతో పాలాభిషేకం చేశారు. వెండి తొడుగులతో కూడిన ఆభరణాలు, పట్టు పీతాంబరాలతో అమ్మవారిని ముస్తాబు చేశారు. విశేష పూజలానంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

నిర్భయంగా ఓటు వేయండి



మాట్లాడుతున్న డీడీ నాగేశ్వరరావు

గంగాధరనెల్లూరు: ఈనెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని అడల్ట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ మందిరంలో శుక్రవారం ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటర్లు ప్రలోభాలకు లొంగకుండా నచ్చిన అభ్యర్థికి ఓటు వేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఐసీడీఎస్ పీడీ నాగశైలజ, ఎంపీడీఓ శ్రీదేవి, తహసీల్దారు ఇస్పనాథన్, ఎంఈఓ పాల్గొన్నారు.

పేర్నాటి గెలుపే ధ్యేయం కావాలి



పాలసముద్రం: సమావేశంలో మాట్లాడుతున్న విజయానందరెడ్డి



నగరి: ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి రోజా సోదరుడు రాంప్రసాద్ రెడ్డి

- ఆర్టీసీ వైస్‌చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి

గంగాధరనెల్లూరు: వైఎస్సార్‌సీపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి గెలుపే ధ్యేయంగా పనిచేయాలని ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం జీడీనెల్లూరు మండలం ఎస్‌ఎస్‌కొండలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులలతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 13వ తేదీ జరిగే ఎన్నికల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆయా గ్రామాల్లో ఓటర్ల ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించి ఓట్లు అడగాలన్నారు. పార్టీ మండల కన్వీనర్ పూర్ణ చంద్రారెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గుణశేఖర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యం, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఏకాంబరం, నియోజకవర్గ బూత్‌కమిటీ కన్వీనర్ నారాయణరెడ్డి, నాయకులు అంబోదరపల్లి బాబురెడ్డి, బాబునాయుడు, సురేంద్రరెడ్డి, శంకర్, పెద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా కృషి చేయాలి

వెదురుకుప్పం: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి అన్నారు. మండలంలోని గంటావారిపల్లెలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్ని మనస్పర్థలు ఉన్నా పక్కనపెట్టి అందరూ సమన్వయంతో పని చేసి శ్యాంప్రసాద్‌రెడ్డి విజయానికి కృషి చేయాలని సూచించారు. పేర్నాటిని గెలిపించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇద్దామన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మనాభరెడ్డి, మండల అధ్యక్షుడు ధనంజయరెడ్డి, మాజీ ఎంపీపీ పురుషోత్తం, ఎంపీటీసీ గుణశేఖర్, సర్పంచ్ గోవిందయ్య, నాయకులు రామయ్య, వెంకటేశ్, గురవారెడ్డి, రోశిరెడ్డి, భీమశంకర్‌రెడ్డి, శివాజీ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను వివరించండి

పాలసముద్రం/శ్రీరంగరాజపురం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించేలా చూడాల్సిన బాధ్యత స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులపై ఉందని ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్ శివప్రకాష్ రాజు అన్నారు. పాలసముద్రం, శ్రీరంగరాజపురంలోని కల్యాణ మండపాల్లో ఆయా మండలాల పరిధిలోని పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు దిగ్గజ పారిశ్రామికవేత్తలు ఉత్సాహం చూపుతున్నారన్నారు. దీంతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు మెండుగా లభిస్తాయని అభిప్రాయపడ్డారు. తమ పరిధిలోని పట్టభద్రులను కలిసి విద్యాభివృద్ధి, ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించాలని సూచించారు. పార్టీ మండల కన్వీనర్ తులసి యాదవ్, వైఎస్ ఎంపీపీ శేఖర్‌యాదవ్, ఇందిరమ్మ, ఆర్‌బీకే చెర్మన్ పోలయ్య, సుందరాజు, సర్పంచ్ గాలి మహేష్ బాబు, నాయకులు భాస్కర్‌రెడ్డి, గోవిందరాజులు, సుమన్‌రాజు, అరుల్, వేణు, షణ్ముగరెడ్డి, మోహన్, రవిరెడ్డి, వరదరాజు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిని గెలిపించుకుందాం

వడమాలపేట: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన శ్యాంప్రసాద్ రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలను భారీ మెజారిటీతో గెలిపించుకుందామని మంత్రి ఆర్కే రోజా సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి కోరారు. శుక్రవారం వడమాలపేటలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త పట్టభద్ర ఓటరును కలిసి మద్దతు కోరాలని సూచించారు. పోలింగ్ రోజున ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చొరవ చూపాలన్నారు. డీసీసీబీ బ్యాంకు డైరెక్టర్ కరుణాకర్‌చౌదరి, పుత్తూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేఖర్, వైస్ ఎంపీపీ ఉపేంద్ర, కాయం సింగిల్ విండో అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సదాశివయ్య, సర్పంచ్‌లు ధర్మయ్య, అంజమ్మ, శ్రీవిద్య, నాయకులు సురేష్‌కుమార్, యాదవేంద్రరెడ్డి, రమేష్‌రాజు, నందయ్య, గాంధీ, సుబ్రమణ్యంరెడ్డి, మునిబాబు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

నగరి: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. కీళపట్టు, నగరి ప్రాంతాల్లో మంత్రి సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి శుక్రవారం ముమ్మర ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రజలకు మేలు చేసే ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రారెడ్డి, కౌన్సిలర్లు బీడీ భాస్కర్, యాకోబు, అమర్, శశికుమార్, శ్రీనివాసులు, యోవాన్, కుమార్, షణ్ముగం, లోకనాథం పాల్గొన్నారు.



వడమాలపేటలో వైఎస్సార్‌సీపీ నాయకులు



పుత్తూరు: ఎంపీపీ మునివేలు ప్రచారం



కార్వేటినగరంలో..

జగనన్న అభ్యర్థికి మద్దతు తెలపండి

పుత్తూరు రూరల్: సేవా దృక్పథం కలిగిన శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించుకోవడం ద్వారా విద్యారంగానికి మరింత మేలు జరుగుతుందని ఎంపీపీ మునివేలు అన్నారు. పట్టణంలోని పలు కళాశాలల్లో ఓట్లు అభ్యర్థించారు. కనకంపాళెం సర్పంచ్ బాబు పాల్గొన్నారు.

అభివృద్ధికి పట్టం కట్టండి

కార్వేటినగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో జరుగుతున్న అభివృద్ధిని చూసి శ్యాంప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డిని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన ప్రచారం చేశారు. పార్టీ మండల కన్వీనర్ ధనంజయవర్మ, నాయకులు పట్నం ప్రభాకర్‌రెడ్డి, గోపి పాల్గొన్నారు.

వంద శాతం పోలింగ్‌కు కృషి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న రాంప్రసాద్‌రెడ్డి

నగరి: మార్చి 13వ తేదీ జరగనున్న తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 100 శాతం ఓట్లు పోల్ అయ్యేలా సమష్టిగా కృషి చేయాలని మంత్రి ఆర్కేరోజా సోదరుడు రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మంత్రి క్యాంప్ కార్యాలయంలో నగరి మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో 7,714 పట్టభద్రుల ఓట్లు ఉన్నాయని, ఓటింగ్ రోజున 100 శాతం ఓట్లు పోల్ అయ్యేలా చూడాలన్నారు. వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించేందుకు అందరూ కలిసి పనిచేయాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సేవాగుణం కలిగిన అభ్యర్థులనే ఎంపిక చేశారని, వారిని గెలిపించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రారెడ్డి, ఎంపీపీ భార్గవి, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ హరి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న రాంప్రసాద్‌రెడ్డి

వడమాలపేట: స్థానిక సర్పంచ్ మునెమ్మ భర్త వెంకటాద్రి ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి రోజా సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి శుక్రవారం ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. వారి కుటుంబానికి పార్టీ అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ. 25 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ సదాశివయ్య, వైస్ ఎంపీపీ ఉపేంద్ర, సర్పంచ్‌లు శ్రీవిద్య, అంజమ్మ, ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న కారు

- ఇద్దరికి తీవ్ర గాయాలు

గంగవరం: మండలంలోని గోశాల వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం ముందు వెళ్తున్న ఆటోను కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు తీవ్రంగా గాయపడగా, కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్పంగా గాయపడ్డారు. మండలంలోని పెద్దినేపల్లెకు చెందిన వెంకటమ్మ(49) సిమెంట్ బస్తాలను పలమనేరు నుంచి ఆటోలో వేసుకుని గ్రామానికి వెళ్తోంది. మార్గ మధ్యంలో గోశాల ఎదురుగా వెనుక వస్తున్న కారు ఆటోను ఢీకొంది. కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఆటో డ్రైవర్, వెంకటమ్మకు తీవ్ర గాయాలు కాగా, కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను పలమనేరు ఆస్పత్రికి తరలించారు.

మహాభారత ఉత్సవాలు ప్రారంభం



ధ్వజారోహణం పూజల్లో భక్తులు

శ్రీరంగరాజపురం: మండల కేంద్రంలోని ద్రౌపదీ ధర్మరాజుల స్వామివారి ఆలయంలో శుక్రవారం మహాభారత ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ద్రౌపదీ, పాండవుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి రోజూ హరికథతో పాటు రాత్రి వీధి నాటకం జరుగుతుందని ఆలయ ధర్మకర్త వేణు నాయుడు తెలిపారు.

నివాళి



నివాళులర్పిస్తున్న కుమారస్వామిరెడ్డి

నగరి (విజయపురం): విజయపురం గ్రామానికి చెందిన డి.రామచంద్రరాజు శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. మృతదేహానికి మంత్రి ఆర్కే రోజా సోదరుడు కుమారస్వామిరెడ్డి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాలసముద్రం: మండల పరిధిలోని జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాల్సిన బాధ్యత ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై ఉందని ఎంపీడీఓ విద్యావతి తెలిపారు. శుక్రవారం నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. సకాలంలో బిల్లులు మంజూరు అయ్యేలా చూస్తామని భరోసా ఇచ్చారు. లేఅవుట్‌లో తాగునీరు, రోడ్లు, విద్యుత్ కొరతలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్ ఏఈ మధు, రమేష్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు



పాదిరేడులో పశువులకు టీకా వేస్తున్న వైద్యసిబ్బంది

వడమాలపేట: మండలంలోని పాదిరేడు పంచాయతీలోని పశువులకు శుక్రవారం గాలికుంటు టీకాలు వేశారు. డాక్టర్ గురునాథం మాట్లాడుతూ.. టీకా వేయడం వల్ల పాలు తగ్గడం జరగదని.. అవన్నీ అపోహలేనని స్పష్టం చేశారు. మార్చి 31వ తేదీ వరకు కార్యక్రమం జరుగుతుందని.. పాడి రైతులు తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు. పశువైద్య సిబ్బంది ప్రతి గ్రామానికి వెళ్లి ఆవులు, గేదెలకు టీకాలు వేయాలన్నారు. మండలంలో ఇప్పటి వరకు 1596 టీకాలు వేశామని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి మురళీధర్‌రెడ్డి, డాక్టర్ శ్రీదేవి, లోకనాథం పాల్గొన్నారు.

ఆక్రమణను తొలగిస్తాం

వెదురుకుప్పం: గ్రామకంఠం ఆక్రమణను తొలగిస్తామని డీపీఓ లక్ష్మి అన్నారు. ఇనాంకొత్తూరు గ్రామంలో గ్రామకంఠం భూమిని ఆక్రమించినట్లు స్పందనలో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. స్పందించిన డీపీఓ శుక్రవారం గ్రామాన్ని సందర్శించి ఆక్రమిత గ్రామకంఠం భూమిని పరిశీలించారు. గ్రామకంఠం భూమిని ఎవరు ఆక్రమించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బంది రీసర్వేలో ఉన్న కారణంగా రెండు వారాల్లో సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఫిర్యాదుదారులకు చెప్పారు. అనంతరం పచ్చికాపల్లం గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. సిబ్బంది హాజరు, రికార్డులను పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. డీడీఓలు కుమార్, మోహన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్‌కు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

నగరి: వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో మంచానికే పరిమితమైన ఎలక్ట్రీషియన్ రామచంద్రకు ఎలక్ట్రికల్ అసోసియేషన్ సభ్యులు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. శుక్రవారం రామచంద్ర ఇంటికి వెళ్లి నగదు అందజేసి ధైర్యం చెప్పారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద్‌కుమార్, ఇంద్రయ్య, సభ్యులు ఏఎస్ రవి, కేపీ కుమార్, టి.దామోదరం, ఈశ్వరన్, హేమాద్రి, అరుణగిరి, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

అల్బెండజోల్ మాత్రలు పంపిణీ





నగరి: ఉపాధ్యాయులకు మాత్రలు అందిస్తున్న ఎంఈఓ, వెదురుకుప్పంలో..



వడమాలపేటలో..

నగరి: విద్యార్థుల్లో నులిపురుగుల నివారణకు ప్రభుత్వం సరఫరా చేసే అల్బెండజోల్ మాత్రలను ఎంఈఓ శ్రీదేవి ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీలో ఉపాధ్యాయులకు అందజేశారు.

కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

వడమాలపేట: ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అల్బెండోల్ మాత్రలు ఇవ్వాలని వైద్యాధికారిణి సుధారాణి అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామ, మండల స్థాయి అధికారులు సమష్టిగా కృషి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రతి పాఠశాల, అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలకు మాత్రలు వేయాలన్నారు. అనంతరం అల్బెండజోల్ మందులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ చక్రపాణి, ఏఓ శేఖర్, గౌరి, చంద్రమోహన్ పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు మాత్రలు

వెదురుకుప్పం: నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ సుధాకరరావు అన్నారు. నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వెదురుకుప్పంలో ఆరోగ్య సిబ్బంది ప్రధానోపాధ్యాయులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని సూచించారు. నులిపురుగుల కారణంగా పిల్లల ఎదుగుదలకు అవరోధం ఏర్పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సురేఖ, సీహెచ్‌ఓ వెంకటరమణయ్య పాల్గొన్నారు.

అతివల ఆర్థికాభివృద్ధికి బాసట

స్వయం సహాయక సంఘాల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా మహిళా సమాఖ్య చర్యలు చేపడుతోంది. జిల్లా సమాఖ్య భవనం ఆవరణలో నాటు కోళ్ల పెంపకం, మార్ట్ నిర్వహిస్తోంది. వీటి నిర్వహణతో ఆదాయాన్ని ఎలా పెంపొందించుకోవాలో అవగాహన కల్పిస్తోంది. మహిళాభ్యుదయానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే మహిళా సమాఖ్య గ్రామాల్లోని మహిళలకు చేయూతనందిస్తోంది.



- జిల్లా సమాఖ్య ఆవరణలో నాటు కోళ్ల పెంపకం
- మార్ట్ ఏర్పాటుతో మరింత ఆదాయం



జిల్లా సమాఖ్య ఆవరణలో పెంచుతున్న నాటుకోళ్లు

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లా సమాఖ్య భవనం ఆవరణలో నాటుకోళ్ల పెంపకం, మార్ట్ నిర్వహణతో మంచి ఆదాయం వస్తోంది. జిల్లాలోని డ్వాక్రా మహిళా సంఘాల నిర్వహణకు వీలుగా గ్రామ, మండల, జిల్లా స్థాయి సమాఖ్య సంఘాలను ఏర్పాటు చేశారు. ప్రతి స్థాయి సంఘాల మేరకు అధ్యక్ష, కార్యదర్శులతో కూడిన కార్యవర్గాన్ని మహిళలను ఏర్పాటు చేసుకుని సంఘాలను పటిష్టంగా నిర్వహిస్తున్నారు. జిల్లా స్థాయి మహిళా సమాఖ్య నిర్వహణకు చిత్తూరులో భవనాన్ని నిర్మించారు. ఈ భవనంలో నెలవారీ జిల్లా స్థాయి సమావేశాలతో పాటు, సంఘాల నిర్వహణపై ఎప్పటికప్పుడు మహిళలకు శిక్షణ కూడా ఇస్తున్నారు. ఈ భవనంలో సంఘాల నిర్వహణకు అవసరమైన సిబ్బంది విధులు నిర్వహిస్తుంటారు. సిబ్బందికి జీత భత్యాలు, భవనం నిర్వహణ తదితర ఖర్చులను జిల్లా సమాఖ్య నుంచి వెచ్చిస్తున్నారు. జిల్లా సమాఖ్య నిర్వహణకు అవసరమైన నిధులను మరింత పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా జిల్లా సమాఖ్య భవనం ఆవరణలో నాటుకోళ్ల పెంపకం, మార్ట్ నిర్వహణ తదితరాలు చేపడుతున్నారు. వీటి నుంచి వచ్చే ఆదాయంతో జిల్లా సమాఖ్య భవనం నిర్వహణ చేపట్టే విధంగా చర్యలు తీసుకున్నారు.

తక్కువ ధరకు నాటు కోళ్లు

జిల్లా సమాఖ్య భవనం వద్ద నెల రోజుల కిందట మహిళా సమాఖ్య సభ్యులు నాటు కోళ్ల పెంపకాన్ని ప్రారంభించింది. చిన్నపాటి షెడ్డు ఏర్పాటు చేసి ప్రస్తుతం 100 నాటు కోళ్లతో పాటు, గిన్ని కోళ్లు, బాతులు, టర్కీ కోళ్లను కూడా పెంచుతోంది. కోడి పిల్లలను తీసుకువచ్చి షెడ్లలో ఉంచి డ్రింకర్లు, ఫీడర్లు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు మేత, నీరు అందించి ఆరోగ్యకరమైన వాతావరణంలో పెంచుతున్నారు. కోళ్లను, గుడ్లను ప్రైవేటు మార్కెట్ కన్నా తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. దీంతో నగరవాసులు అధికంగా జిల్లా సమాఖ్య వద్ద కోళ్లను కొనుగోలు చేస్తున్నారు.

మార్ట్‌లో 150 రకాల వస్తువులు

డ్వాక్రా మహిళలు తయారు చేసే వస్తువులు, పండించే పంటలను విక్రయించే విధంగా జిల్లా సమాఖ్య ఆవరణలో మహిళా సభ్యులు మార్ట్‌ను ఏర్పాటు చేశారు. ఈ మార్ట్‌లో నిత్యావసర సరుకులు, డ్రై ఫ్రూట్స్, చిరుధాన్యాలు, ప్రకృతి వ్యవసాయంతో తయారు చేసిన బెల్లం, నల్లబియ్యం తదితరాలను తక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. ఇందుకు అవసరమైన ఉత్పత్తులను రైతుల నుంచి సేకరించి, వాటిని శుభ్రపరచి మార్ట్‌లో విక్రయించి పరోక్షంగా రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నారు. దీంతోపాటు డ్వాక్రా మహిళలు తయారు చేసిన వస్తువులు బ్యాగులు, టెర్రకోట బొమ్మలు, కొయ్య బొమ్మలు, గిరిజనుల నుంచి సేకరించిన వివిధ రకాల ఉత్పత్తులు, తేనె, సోపులు, షాంపులు, తినుబండారాలు తదిరాలు మొత్తం 150 రకాల వస్తువులు మార్కెట్ ధరకంటే తక్కువకు విక్రయిస్తున్నారు. ధరలు అందుబాటులో ఉండడంతో విక్రయాలు క్రమంగా ఊపందుకుంటున్నాయి. టర్నోవర్ కూడా పెరుగుతుండడంతో మహిళా సమాఖ్య ఆర్థికాభివృద్ధి సాధిస్తోంది.



జిల్లా మహిళా సమాఖ్య నడుపుతున్న మార్ట్

మహిళల్లో చైతన్యమే లక్ష్యం



స్వయం సహాయక సంఘాల మహిళల్లో ఆర్థికాభివృద్ధిపై చైతన్యం తేవడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో పెరటికోళ్ల పెంపకం చేపట్టడం వల్ల వచ్చే ఆదాయాన్ని మహిళలకు తెలియజేయడం. ప్రకృతి వ్యవసాయంతో దిగుబడి అయ్యే ఉత్పత్తులు తీసుకోవడం వల్ల ఆరోగ్యకరమైన జీవనాన్ని తెలపడం కోసం మోడల్‌గా కోళ్ల పెంపకం, మార్ట్‌ను నిర్వహిస్తున్నాం. తద్వారా వచ్చే ఆదాయాన్ని జిల్లా సమాఖ్య నిర్వహణకు వెచ్చిస్తున్నాం.

– తులసి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్